క్లుప్తంగా

అర్హులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి



ఉండవెల్లి: మండల కేంద్రంలో ఆదివారం సీపీఎం(ఐ) నాయకులు గుడిసెలు, ఖాళీ స్థలాలు ఉన్న వారి వద్దకు నేరుగా వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులకు స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10న ఇండ్లు, స్థలాలు లేని వారు తహసీల్దార్ కార్యాలయం ముట్టడికి రావాలని కాలనీవాసులు తెలిపినట్లు పేర్కొన్నారు. ప్రతి పేదలకు ఇండ్లు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం(ఐ) నాయకులు వెంకటేశ్వర్లు, ఈదన్న, మద్దిలేటి, హమాలి నాయకులు వెంకట్రాముడు, నరసింహ, శేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

శాంతినగర్ : కాంగ్రెస్ పార్టీలో ఆయా మండలాలకు చెందిన యువకులు చేరినట్లు ఆ పార్టీ శాంతినగర్ క్యాంప్ కార్యాలయం తెలిపింది. ఇటిక్యాల మండలం సాతర్ల, రాజోళి మండల కేంద్రం నుంచి మైనార్టీ సోదరులు పార్టీలో చేరినట్లు వివరించారు. అనంతరం కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యదర్శి దేవేందర్ జన్మదిన వేడుకలను శాంతినగర్ క్యాంప్ కార్యాలయంలో జరుపుకున్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు విద్యార్థులకు సన్మానం

శాంతినగర్ : వడ్డేపల్లి, రాజోళి మండలాల పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాల్లో పదవ తరగతి, జూనియర్ కళాశాలల్లో చదివి మొదటి, రెండో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మానం మంగళవారం నిర్వహిస్తున్నట్లు జై నడిగడ్డ యువత జిల్లా సమన్వయకర్త బొమ్మల రామకృష్ణ, జిల్లా సలహాదారుడు నాయకి రాముడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో విద్య, వైద్య, రాజకీయ సామాజిక చైతన్యం సాధించడానికి తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ ఆధ్వర్యంలో నడుస్తున్న జై నడిగడ్డ యువత ఆధ్వర్యంలో శాంతినగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యార్థులతోపాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులకు సన్మానం చేయనున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలలు, కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు సకాలంలో కార్యక్రమానికి హాజరై సన్మానాలు పొందాలని జిల్లా సలహాదారుడు నాయకి రాముడు కోరారు.

వర్షం కోసం పూజలు

శాంతినగర్ : వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురవాలని కోరుతూ పూజలు నిర్వహించారు. ఆదివారం వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామివారి ఆలయంలో గ్రామ యువకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయ మూల విగ్రహాన్ని నిండుకుండ నీటితో శుద్ధిచేశారు. ఆకులపూజ, పంచామృతాభిషేకం పూజలు నిర్వహించారు. నారికేళాలు, ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు బాగా కురిసి పంటలు సంవృద్ధిగా పండాలని కోరుకున్నారు.

అధ్యక్షులకు సన్మానం

అమరచింత: మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్‌లను టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజు గౌడ్, డీసీసీ నారాయణపేట అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సన్మానించారు. పార్టీ కార్యక్రమాలతో పాటు మండలం, నియోజక వర్గంలో పార్టీ ఎదుగుదల కోసం నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కురుమూర్తి, తౌఫిక్, విష్ణు, హన్మంత్ నాయక్, నాగు నాయక్, రహ్మతుల్లా, రవి, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యే నిలిచిన నీరు



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంబాళాపురంలో అంతర్గత రహదారులు గుంతలు ఏర్పడంతో వానలకు నీరు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల కింద సీసీ రోడ్డు వేశారు కానీ, గుంతలు పూడ్చ లేదని కాలనీవాసులు తెలుపుతున్నారు. నీరు నిలిచి దుర్వాసన, దోమలు ఎక్కువై చిన్నారులు రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని, అధికారులు స్పందించి డ్రెయినేజీలు, సీసీ రహదారి వేయాలని కోరుతున్నారు.

కౌలు రైతు దిగాలు

- పెరిగిన కౌలు రేట్లు, పెట్టుబడి వ్యయం
- ఆదుకోని ప్రభుత్వ పథకాలు
- రుణాలివ్వని బ్యాంక్‌లు
- నష్టాలొస్తున్నా వ్యవసాయంపై తగ్గని మక్కువ



చెన్నిపాడులో కౌలు పొలాన్ని ఎద్దులతో దుక్కిదున్నుతున్న రైతు

మానవపాడు: రైతును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నిరకాలుగా ఆదుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిసీజన్‌లో పెట్టుబడి సాయంగా పొలం ఉన్న రైతులకు ఎకరాకు రూ. 5వేలు చొప్పున ఏడాదికి రూ. 10వేలు పెట్టుబడి సాయం అందిస్తుండగా.. కేంద్రం ఏడాదిగా రూ. 6వేలు అందిస్తోంది. కౌలురైతుల పరిస్థితి మాత్రం అందుకు పూర్తిభిన్నంగా ఉంది. వీరికి ఈ పథకాలు వర్తించక.. పెట్టుబడులకు అధికవడ్డీకి అప్పుతెచ్చి మరీ పంటలు సాగు చేస్తున్నారు.. ఏటేటా పెరుగుతున్న నిత్యవసర సరుకులకు తోడు కౌలు రేట్లు పెరుగుతుండటంతో మిగులుబాటు ఉండడంలేదని కౌలుదారులు వాపోతున్నారు. బోరుబావులు, నీటి లభ్యత ఉన్నా కాల్వల వద్ద ఆయకట్టులో వానాకాలం సీజన్‌లో ఎకరాకు రూ. 12వేల నుంచి సుమారు రూ. 43వేల దాకా కౌలురైతులు భూమి యజమానులకు ఇస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో సాగవుతున్న భూమిలో 50శాతం పైగా కౌలు రైతుల చేతుల్లోనే ఉందని నియోజకవర్గ రైతులు చెబుతున్నారు. వారంతా దాదాపు భూమి లేని రైతులు, సన్నచిన్నకారు రైతులు ఎక్కువగా ఉన్నారు. కౌలు రైతులకు భూ అధికారిక పత్రాలు లేకపోవడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. పెట్టుబడులకోసం కౌలు రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలవుతున్నారు. ప్రస్తుతం రైతుబీమా కేవలం పట్టాదారు రైతుల కుటుంబాలకు మాత్రమే అందుతోంది. కౌలు రైతులకు పథకాలు అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ధరలు పెరిగాయి..



గతేడాదితో పోలిస్తే కౌలు ధరలు సుమారు పన్నెండు వేల వరకు పెరిగాయి. ఎకరాకు రూ. 36 వేలు చెల్లించి కౌలుకు పంటను సాగుచేస్తున్నా. నాకున్న సొంత పొలంతో పాటు సుమారు 12 ఎకరాలకు పైగా కౌలుకు తీసుకున్నా. ఖర్చులు పెరిగి, పరిస్థితి దయనీయంగా ఉంది. బ్యాంకులు సైతం తమకు ఎలాంటి రుణాలు అందించడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో అధిక వడ్డీకి అప్పులు తెచ్చి సాగు చేయాల్సి వస్తోంది. కౌలు రైతులు కష్టాలను చూసి రైతుబంధుకానీ, మద్దతు ధర కానీ పెంచితే కౌలు రైతు బాగుంటాడు.

– మద్దిలేటి, రైతు, గోకులపాడు

రైతుకు ఆర్థికసాయం చేయాలి..



నా కున్న 4ఎకరాల పొలంతో పాటు 26 ఎకరాలు కౌలు తీసుకున్నా.. నియోజకవర్గ వ్యాప్తంగా ఎకరాకు రూ. 25వేల నుంచి 43వేలకు పైగా కౌలుకు రైతులు పొలాన్ని కౌలుకు తీసుకుంటున్నారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా ఎకరాకు కౌలు రైతులకు మిర్చి సాగుకు రూ.2.50లక్షలు, పత్తిసాగుకు రూ. 60వేలు దాకా ఖర్చులు అవుతున్నాయి. పంట నష్టం వస్తే రైతుకు రూ. లక్షలో నష్టం వస్తుంది. ప్రభుత్వం పంట పండించిన రైతులకు గిటుబాటు ధర, కౌలు రైతుకు లాభం చేకూరేలా చూడాలి.

– మద్దిలేటి, రైతు, చెన్నిపాడు

కనీస మద్దతుధర చట్టం తేవాలి..



కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కనీస మద్దతు ధర చట్టం తేవాలి. కేంద్రం ప్రకటించే మద్దతు ధరకు రాష్ట్రం బోనస్ ఇవ్వాలి. అదేవిధంగా బ్యాంకుల నుంచి ప్రతి కౌలుదారుడికి పంట రుణాలు అందించి ఆర్థికంగా ఆదుకోవాలి. వారికి కూడా ఓ చట్టం తేవాలి. రైతుబీమా, పంటబీమా వర్తింపజేయాలి. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతుకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీకాంత్‌రెడ్డి, రైతు, మానవపాడు

బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



మల్లెందొడ్డిలో గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్ : బడుగు, బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి పరచడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మల్లెందొడ్డిలో రెండోవిడత మంజూరైన లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రైతుబంధు, రైతుభీమా, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ వంటి పథకాలను ప్రవేశపెట్టిన నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పెద్ద వీరన్న, పీఏసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ విష్ణు, పశువైద్య అధికారులు యామినిసాయి, శంకరయ్య, మండల నాయకులు మధుసూదన్‌రెడ్డి, చక్రధర్ రెడ్డి, హైదర్‌సాబ్, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆంజనేయులు, భాస్కర్, వెంకటన్న, నరేందర్, చంద్రశేఖర్‌రెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ధరూరు : మండల పరిధిలోని ఓబులోపల్లిలో ఆదివారం రెండోవిడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా వివిధ సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కుర్వకులస్తుల గురించి ఏనాడు పట్టించుకోలేదన్నారు. సీఎం కేసీఆర్ కుర్వకులస్తులను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఈ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. మొదటి విడతలో దాదాపుగా గొర్రెలపంపిణీ చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా మండల పరిధిలోని నెట్టెంపాడులో ఆదివారం కతలప్ప అనే వ్యక్తికి మంజూరైన దళితబంధు ద్వారా ఏర్పాటుచేసిన కోళ్లఫారాన్ని ఆయన ఎంపీపీ నజీమున్నీసా బేగం, జెడ్పీటీసీ పద్మావెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితబంధుతో ప్రతి దళితుడు ఆత్మస్థైర్యంతో బతకాలన్నదే ముఖ్య ఉద్దేశమని, ఈ పథకం ద్వారా ప్రతి పేద కుటుంబం బాగుండాలని సీఎం కేసీఆర్ ఆలోచించారన్నారు. తాను ఉపాధి పొందడమే కాకుండా నలుగురికి ఉపాధి కల్పించాలన్నదే పథకం లక్ష్యమన్నారు. అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కుట్టు మిషన్లు, కుటీర పరిశ్రమలు స్థాపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, భీంరెడ్డి, ఎంపీపీలు నజీమున్నీసా బేగం, రాజారెడ్డి, విజయ్, జెడ్పీటీసీ పద్మావెంకటేశ్వరరెడ్డి, వైస్‌ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ పరుశరాముడు, మండల యూత్ అదులు పురుషోత్తం రెడ్డి, నాయకులు జాంపల్లి వెంకటేశ్వరరెడ్డి, నాగన్న, భాస్కర్, రామకృష్ణ నాయుడు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు: ఎస్ఐ

రాజోళి: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎంఏ ఖాదీర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. వాహనదారులు తమ వెంట లైసెన్స్‌లు ఉంచుకోవాలన్నారు. హెల్మెట్, సీటు బెల్టులు ధరించకుండా వాహనాలు నడపొద్దని, తాగి రోడ్లపైకి రావడం చేస్తే కేసులునమోదు చేస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వడంతో వారు రోడ్లపైకి వచ్చి ప్రమాదాలకు గురువుతున్నారన్నారు. దీని ద్వారా ఇరు కుటుంబాల వారు ఇబ్బందులు పడతారన్నారు. వాహనదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని సూచించారు.

వాహనాల తనిఖీ



జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ కె.రాము

మానవపాడు: మండలంలోని జల్లాపురం శివారప్రాంతంలోని ఆదివారం జాతీయ రహదారిపై ఎస్ఐ కె.రాము వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సరైనా ధృవపత్రాలు కల్గి ఉండాలని లేనివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా సరైనా ధృవపత్రాలు లేనివారికి 11 మందిపై కేసులు నమోదు చేసి రూ. 1100 జరిమానా విధించామన్నారు. రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలపై సర్వే



చెన్నిపాడులో సర్వే నిర్వహిస్తున్న ఎంపీఓ ఆంజనేయరెడ్డి, అధికారులు

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, చంద్రశేఖర్‌నగర్ గ్రామాల్లో ఆదివారం ఎంపీఓ ఆంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలపై సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మరుగుదొడ్లు, ఇంకుడుగుంతల సర్వేలో భాగంగా మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు గ్రామ బుక్‌కి పర్లు ఇంటింటికీ వెళ్లి గ్రామాల్లో ఎన్ని మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు ఉన్నాయో వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



ఎంపీడీవో కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికుల సమ్మె



వడ్డేపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు

అలంపూర్ : గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఉద్యోగభద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారంతో నాల్గో చేరింది. పంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మెకు ఆయన మద్దతు పలికి మాట్లాడుతూ.. 11వ పీఆర్‌సీ ప్రకారం పంచాయతీ కార్మికులకు కనీసం వేతనం రూ. 19 వేలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 51 జీఓ ద్వారా మల్టీపర్పస్ విధానాన్ని అమలు చేసి కార్మికులను ఇష్టం వచ్చినట్లు తొలగిస్తూ ఉద్యోగభద్ర లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికసంఘం నాయకులు సీహెచ్ మద్దిలేటి, లాలన్న, మద్దిలేటి, సర్దార్, బాలమాషన్న, అఖిల్, చిన్ననరసింహ్మ ఉన్నారు.

మల్దకల్ : గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు చేపడుతున్న సమ్మె ఆదివారంతో నాలుగోరోజుకు చేరింది. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెలో వారు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ప్రమాదబీమా కల్పించాలన్నారు. అలాగే నెలనెల వేతనాలు చెల్లించడంతో పాటు పెండింగ్‌లో బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధరూరు : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెమ్మిచేడు కార్తిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం గేటు వద్ద చేపడుతున్న సమ్మెలో పాల్గొని ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12వేల 769 మంది కార్మికుల ఉద్యోగ భద్రతలేదని అన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని కార్మికులను రెగ్యూలర్ చేయడంతో పాటు ప్రమాదాల్లో మరణించిన కుటుంబాలకు రూ. 10లక్షల నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులను కేవలం మురికి పనుల కార్మికులుగా మాత్రమే గుర్తిస్తున్నారని, అలాగే రకరకాల వేధింపులకు గురిచేస్తూ సర్పంచులు, పంచాయతీ కార్మికులను వేధిస్తున్నారన్నారు. సరైన వేతనం, ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఆవేదన వక్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ కార్మికులు చంద్రాములు, హన్మంతు, దేవరాజు, దేవసాయం, రవి కుమార్, కాలప్ప, నాగరాజు, నరేష్, సతీష్ పాల్గొన్నారు.

శాంతినగర్ : గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ వడ్డేపల్లి అధ్యక్షుడు మధు డిమాండ్‌చేశారు. సమస్యలు పరిష్కరించాలని కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి నాల్గవరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవో నం. 60 ప్రకారం వేతనాలు పెంచాలని, ప్రమాదాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదలచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, రవి, రాముడు, మద్దిలేటి, ఆంజనేయులు, శ్రీనివాసులు, సోమన్న, ప్రకాషం, పరశురాముడు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికే తెలంగాణ దిక్సూచి

- ఎమ్మెల్యే వీఎం అబ్రహం



మైనార్టీలకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్ రూరల్ : సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు దేశానికే దిక్సూచిగా నిలిచాయని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని క్యాతూర్‌లో ఆదివారం మైనార్టీ షాదిఖానా నిర్మాణంకోసం రూ. 25 లక్షల ప్రొసీడింగ్ పత్రాలను మైనార్టీలకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మైనార్టీలు ఎమ్మెల్యేకు శాలువా పులమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: గ్రామాల అభివృద్ధే ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. ఆదివారం మండలంలోని చిన్న ఆముదాలపాడులో రూ.10 లక్షలు, తక్కశీలలో రూ.15 లక్షలతో సీసీరోడ్లకు భూమి ఎమ్మెల్యే అబ్రహం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అదేవిధంగా పుల్లూరు శివారులోని స్కందంచర్లో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అభివృద్ధి కావాలంటే రహదారులే ముఖ్యమని అందుకే రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలకు ముఖ్య పాత్ర వహించిందనన్నారు. బీసీలందరికీ రుణాలు అందజేస్తామని, రూ. 3 లక్షల గృహ లక్ష్మి ఇండ్లను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ప్రతి వీధికి రోడ్లను వేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బీసమ్మ, వైస్ ఎంపీపీ దేవన్న, సర్పంచులు మద్దమ్మ, సురవరం లోకేశ్వర్ రెడ్డి, నాయకులు రమణ, నరసింహ, వెంకటేశ్వర్లు గౌడు, మధుసూదన్‌రెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవతో ఆత్మసంతృప్తి..



మెమొంటోతో సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం చైర్మన్ జయంతి వెంకటేశ్వర్లు

శాంతినగర్ : సమాజానికి సేవచేయడంతో ఆత్మ సంతృప్తి ఉంటుందని వాసవీక్లబ్ రీజినల్ చైర్మెన్ జయంతి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం వడ్డేపల్లి పురపరిధిలోని స్థానిక కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో డాన్ టు డెస్క్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. మనిషికి కోట్లు సంపాధించిన కలగని ఆనందం సేవ చేయడంలో కల్గుతుందన్నారు. సేవ చేయడానికి కులం, మతం, ప్రాంతీయ విభేదాలు ఉండవని, సేవకు అవధులు లేవన్నారు. ఈ సందర్భంగా రక్షక మిత్రగా రిటైర్డ్ జవాన్ వెంకటరామిరెడ్డిని, రైతుబంధు కింద తుమ్మిల్ల కృష్ణ, ఆర్యవైశ్య నేస్తం కింద కృష్ణయ్యకు నెలకు సరపడా కిరాణం, ఆపన్న హస్తం కింద 15మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే నష్టాల గురించి అవగాహన కలిస్తున్న సేవాసమితి సభ్యులను మెమొంటోతో సన్మానం చేశారు. వాసవీక్లబ్ కార్యక్రమాలు సజావుగా నిర్వహించాలని పలువురు కోరారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు దొంతు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రమేష్, కో–శాధికారి బాదం సత్యం, ఆర్యవైశ్య సంఘం నాయకులు చలమయ్య, విజయ్, మధు, మణి, మురళి, వాసవీక్లబ్ మహిళసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోతులగిద్దలో భాగవత సప్తాహం ప్రారంభం



కోతులగిద్ద అరణ్యేశ్వర స్వామి ఆలయంలో భక్తులు

ధరూరు : మండల పరిధిలోని కోతులగిద్ద అరణ్యేశ్వర ఆలయం వద్ద ఆదివారం భాగవత సప్తాహం ప్రారంభమైంది. వారం రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులు హాజరైనట్లు ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 7గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు నర్సంహులు, సతీష్, ఈశ్వరయ్య పాల్గొని మాట్లాడారు.. హిందూ ధర్మాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, సత్యన్న, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పట్టుగొమ్మలు



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి

అయిజ: కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని, పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి అన్నారు. ఆదివారం పట్టణంలోని 19వ వార్డులో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మధుకుమార్ ఆధ్వర్యంలో వార్డ్ బూత్, మహిళా కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బలపడుతున్నదని, వచ్చేఎన్నికల్లో అధికారంలోకి వస్తుందన్నారు. అదేవిధంగా పూరి గుడిసెలో ఉన్న బోయ తిక్కన్నకు రూ. 5వేలు ఆర్థిక సాయం చేసి గుడిసెకు మరమ్మతులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు, గిత్తల దేవరాజు, గాలిరెడ్డి, సాంబశివుడు, మైనర్ బాబు, హనుమన్న, సులోచనమ్మ, ముక్కెరన్న, శంకర్‌గౌడ్, పాండురంగ, బసవరాజు, మధు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



దుకాణాల యజమానులకు సలహాలు, సూచనలు ఇస్తున్న కార్యదర్శులు

ఉండవెల్లి: మండల కేంద్రంలో దుకాణాలను పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు. ఆదివారం గ్రామస్తులకు, కిరాణషాపు యజమానులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తడిచెత్త, పొడి చెత్తను వేరుగా చేసి గ్రామాల్లో వచ్చిన చెత్త రిక్షా బండిలో వేయాలని ప్రజలకు సూచించారు. రోడ్లపై చెత్తను నిషేధించాలని, ప్రతి ఒక్కరూ చెత్తను నియంత్రియడానికి దుఖాణాల ముందు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 15న సెంట్రల్ టీం సభ్యులు గ్రామాన్ని సందర్శించి పరిశీలిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ పద్మావతి, పంచాయతీ కార్యదర్శులు అశోక్, బాలకృష్ణ, జ్యోతి, నాగరాజు, కవిత, మహేష్ నాయుడు తదితర్లు పాల్గొన్నారు.

అసౌకర్యాల సంత..

ఆత్మకూర్: పట్టణంలో ఆదివారం నిర్వహించే సంత అసౌకర్యాల మధ్య కొనసాగుతుండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో అపరిశుభ్రత ప్రదేశాల్లోనే కూరగాయలు, మాంసం విక్రయాలు కొనసాగుతున్నాయి. ప్రతి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది ఇక్కడికి వస్తుంటారు. దుమ్ము, ధూళితో కూడిన కూరగాయలు, ఆకుకూరలతో లాభానికి బదులు నష్టమేనని వినియోగదారులు వాపోతున్నారు. పురపాలక పాలకులు, అధికారులు స్పందించి సమీకృత మార్కెట్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

పెబ్బేరు: హైదరాబాద్‌లో కళావేదిక జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు విజయకుమార్‌ను ఆదివారం చైర్మన్ ప్రతాప్, లలిత, ఈశ్వరి భాషణం తదితరులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.